సాక్షి కామారెడ్డి

గురువారం । 9 । జనవరి । 2025



సైబర్ నేరాలతో..

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు అవగాహన కల్పించారు. ఎవరికీ బ్యాంక్ ఖాతా వివరాలు చెప్పొద్దన్నారు.

- 9లో ▸



ఫోన్లకు బానిసలు కావొద్దు

విద్యార్థులు ఫోన్లకు బానిసలు కావొద్దని, పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావొద్దని జిల్లా మెంటల్ హెల్త్ ఆఫీసర్ రమణ సూచించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.5 /12.7

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

4,484 వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చాం

కామారెడ్డి అర్బన్: అగ్రికల్చర్ పోర్టల్ ద్వారా జిల్లాలో వ్యవసాయ కనెక్షన్ల దరఖాస్తులను సాధ్యమైనంత తొందరగా మంజూరు చేస్తున్నట్లు ఎస్ఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. గత సంవత్సరం జనవరి నుంచి డిసెంబర్ వరకు 4,484 వ్యవసాయ సర్వీసులకు మంజూరు ఇవ్వగా, ఒక డిసెంబర్ నెలలోనే 679 సర్వీసులు మంజూరు చేసినట్లు వివరించారు. ఇది 2023తో పోల్చుకుంటే 45శాతం అధికమని ఎస్ఈ పేర్కొన్నారు. ఈ–స్టోర్ విధానంతో కావాల్సిన సామగ్రి తీసుకోవడం ద్వారా పనులు తొందరగా పూర్తి చేయడానికి క్షేత్రస్థాయిలో సమయం ఆదా అవుతుందని, పనులు వేగంగా జరుగుతున్నాయని ఎస్ఈ వివరించారు.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి



రామారెడ్డి: పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించాలి ఏఎస్పీ చైతన్యరెడ్డి ఆదేశించారు. రామారెడ్డి పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆమె తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఎస్సై నరేష్ ఉన్నారు.

చదువుతోనే మంచి భవిష్యత్తు



కామారెడ్డి టౌన్: చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి నాగరాణి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాల సదన్‌ను ఆమె సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలను ఆరా తీశారు. చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. వంటగది, స్టోర్ రూంలు తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్ పాకెట్‌లను అందజేశారు.

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

సదాశివనగర్: ఇంటర్‌లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని ఉమ్మడి జిల్లా ఇంటర్మీడియట్ ప్రత్యేకాధికారి దాసరి ఒడ్డెన్న అన్నారు. బుధవారం సదాశివనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలంటే చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో చదువుకోవాలని సూచించారు. కాలేజీలకు రాని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. వారు తరగతులకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. గతేడాది ఫలితాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు మైనారిటీ కమిషన్ చైర్మన్ రాక

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ గురువారం జిల్లా కేంద్రానికి రానున్నారని అధికార వర్గాలు తెలిపాయి. ఉదయం 10 గంటలకు జిల్లా అధికారులతో చైర్మన్ సమావేశం అవుతారని, మధ్యాహ్నం 2 గంటల వరకు మైనారిటీ వర్గాల వారి నుంచి విజ్ఞాపనలు స్వీకరిస్తారని అధికారులు తెలిపారు.

నేటి నుంచి పోలీస్ క్యూఆర్ కోడ్



ఖలీల్‌వాడి: ఫిర్యాదుదారులతో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు, వారి స్పందనపై ఫీడ్ బ్యాక్‌ను సేకరించేందుకు ప్రత్యేక క్యూఆర్ కోడ్ గురువారం నుంచి అందుబాటులోకి వస్తుందని ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యూఆర్ కోడ్‌ను రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్‌లు, రద్దీ ప్రాంతాల్లో క్యూ ఆర్ కోడ్‌కు సంబంధించిన పోస్టర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజలు క్యూఆర్ కోడ్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఫీడ్ బ్యాక్ అందజేయాలని కోరారు.



రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసిన ప్రభుత్వం మిల్లింగ్‌పై ఫోకస్ పెట్టింది. గతంలో సీఎంఆర్ ఇవ్వకుండా అక్రమాలకు పాల్పడిన మిల్లర్లపై చర్యలు చేపట్టింది. ఈ సారి అలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా రైస్ మిల్లుల యజమానుల నుంచి అగ్రిమెంట్, బ్యాంకు గ్యారంటీలు తీసుకుంది. జిల్లా అధికారులు కూడా కస్టం మిల్లింగ్ సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. నిత్యం తనిఖీలు చేపడుతున్నారు.

మిల్లింగ్‌పై ఫోకస్!

- రైస్‌మిల్లులకు చేరిన 4.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం
- గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కార్యాచరణ
- ఇప్పటికే జిల్లాలో డిఫాల్టర్‌లుగా 16 మంది మిల్లర్లు



పాల్వంచ మండలంలోని ఓ రైస్‌మిల్లులో మిల్లింగ్ పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: రైతుల నుంచి సేకరించిన ధాన్యం మిల్లింగ్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. గతంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని కనీస జాగ్రత్తలు పాటించకుండా రైస్ మిల్లులకు కేటాయించేవారు. దీంతో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయి. వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పక్కదారి పట్టింది. వాటిని రికవరీ చేయడంలో అధికార యంత్రాంగానికి ఇబ్బందులు తప్పలేదు. ఇప్పటికీ కొందరు మిల్లర్ల నుంచి మొండి బకాయిలు రావాల్సి ఉంది. ఇలాంటి గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ధాన్యంను మిల్లింగ్ చేయడానికి గాను 2024–25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన కేటాయింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు, షరతులను తీసుకువచ్చింది. మిల్లర్ల నుంచి తప్పనిసరిగా అగ్రిమెంట్, బ్యాంక్ గ్యారెంటీలను తీసుకున్నాకే తాజా కేటాయింపులు చేశారు. మరోవైపు జిల్లాలో ధాన్యం సేకరణ పూర్తి కావడంతో సేకరించిన ధాన్యం మరాడించి గోదాములకు తరలించే పనిపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. బకాయి ఉన్న సీఎంఆర్‌ను రికవరీ చేయడంతో పాటు తాజాగా ఇచ్చిన ధాన్యానికి సంబంధించిన సీఎంఆర్ కూడా సకాలంలో పూర్తయ్యేలా చూసేందుకు కలెక్టర్ సంగ్వాన్‌తో పాటు సివిల్ సప్లయ్, రెవెన్యూ అధికారులు నిరంతరంగా పర్యవేక్షిస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ

గత రబీ సీజన్‌కు సంబంధించిన కొంత మేర సీఎంఆర్ ఇంకా మిల్లర్ల నుంచి ప్రభుత్వ గోదాములకు రావాల్సి ఉంది. దీంతో రెండు రోజుల క్రితం కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేసి మిగిలిన సీఎంఆర్‌ను ఈ నెల 25 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. తాజాగా కేటాయించిన ధాన్యం మరాడించడంలో నిర్లక్ష్యం కనబరిస్తే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇదివరకు జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా పర్యవేక్షిస్తున్నారు.

వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా రైతులు 3.14 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇంటి అవసరాలకు పోను 4.80 లక్షల మెట్రిక్ లన్ను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావొచ్చని అధికారులు అప్పట్లో అంచనా వేశారు. కానీ 4.40 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. అప్పటికీ

ధాన్యం సేకరణలో రెండో స్థానం

ధాన్యం సేకరణలో కామారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. ధాన్యం కొనుగోళ్ల కోసం జిల్లావ్యాప్తంగా అధికారులు 424 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి దాదాపు రెండు నెలల పాటు సేకరణ చేపట్టారు. సేకరించిన ధాన్యాన్ని నింబంధనలను పాటిస్తూ గ్యారంటీలు సమర్పించిన మిల్లులకు ఎప్పటికప్పుడు తరలించారు.

నిర్లక్ష్యం చేస్తే చర్యలు



ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం సూచించిన విధంగా అగ్రిమెంట్‌లు, గ్యారంటీలు సమర్పించిన 146 మంది మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు చేపట్టాం. సకాలంలో సీఎంఆర్ పూర్తయ్యేలా నిరంతరంగా పర్యవేక్షిస్తున్నాం. నిర్లక్ష్యం చేస్తే మిల్లర్లపై చర్యలు తీసుకుంటాం. – రాజేందర్, డీఎం, సివిల్ సప్లయ్ కార్పొరేషన్, కామారెడ్డి

గ్యారంటీలు సమర్పించిన వారికే..

జిల్లాలో మొత్తం 162 రైస్‌మిల్లులు ఉన్నాయి. సీఎంఆర్ కోసం వచ్చే ఒక క్వింటాల్ వడ్లకు గాను మరాడించిన తర్వాత 67 కిలోల బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. ఇది వరకు అన్ని రైస్ మిల్లుకు ధాన్యం కేటాయింపులు జరిగేవి. గతంలో చాలా మంది మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ పూర్తి చేసి బియ్యం తిరిగి ఇవ్వలేదు. గతేడాది లెక్కలు తీస్తే జిల్లా నుంచి 49 మంది మిల్లర్లు డిఫాల్టర్‌లుగా తేలారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని డిఫాల్టర్ల నుంచి బియ్యం రికవరీ చేయడానికి కఠినంగా వ్యవహరించింది. కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో చాలా మంది మిల్లర్లు బియ్యం రూపంలో గానీ, నగదు రూపంలో గానీ బకాయిలు చెల్లించారు. ఐదుగురు నగదు రూపంలో చెల్లించగా, మరో 11 మంది మిల్లర్లు 25 శాతం జరిమానాతో కలిపి బకాయిలు చెల్లించారు. అయినప్పటికీ ఇంకా 16 మంది మిల్లర్లు డిఫాల్టర్‌లుగా మిగిలారు. వారికి ఈ సారి ధాన్యం కేటాయింపులు నిలిపివేశారు. అగ్రిమెంట్‌లు, గ్యారంటీలు సమర్పించిన 146 మంది మిల్లర్లకు మాత్రమే ధాన్యాన్ని కేటాయిస్తున్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: నాణ్యతా ప్రమాణాలు సరి చూసుకుని ధాన్యం ఎగుమతులు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ఎగుమతి కార్యాచరణ ప్రణాళికలపై అవగాహన సదస్సును బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఎగుమతులపై సందేహాలు, సలహాలు, సూచనలు అందించడానికి జిల్లాలోని వ్యాపారవేత్తలకు ఇలాంటి సమావేశాలు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. జిల్లాలో అత్యధికంగా సాగవుతున్న వరి ధాన్యం ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ధాన్యంతో పాటు జిల్లా నుంచి జరిగే ఇతర ఎగుమతుల్లో ఎదురవుతున్న అడ్డంకులపై వ్యాపారులతో చర్చించారు. ఈ సదస్సులో ఎంఎస్ఎంఈ, బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్), అపెడ, టీఎస్ఐఐసి, పలు సంస్థల ప్రతినిధులు, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ లాలు నాయక్, డీఏవో తిరుమల ప్రసాద్, మత్స్య శాఖాధికారి శ్రీపతి, డీఆర్‌డీవో సురేందర్, మార్కెటింగ్ అధికారి రమ్య పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం తనిఖీ చేశారు. గోదాంలో భద్రతా ఏర్పాట్లు, రికార్డులు, సీసీటీవీ ద్వారా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరు తదితర అంశాలను పరిశీలించారు. ఈవీఎం గోదాం వద్ద పోలీసు బందోబస్తు వివరాలు తెలుసుకున్నారు. ఓటింగ్ యంత్రాల భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో రంగనాథ్ రావు, తహసీల్దార్ జనార్దన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు సరళ, డీటీలు అనిల్, ఇందిర తదితరులు ఉన్నారు.

తనయుడి జాడ కోసం వెళ్తే.. ఎదురొచ్చిన మృత్యువు

- రైలు ఢీకొని తండ్రి మృతి
- మెదక్ జిల్లా అక్కన్నపేటలో ఘటన



గంగయ్యగారి నర్సింలు (ఫైల్)

భిక్కనూరు: ఆత్మహత్య చేసుకుంటానని స్నేహితుడికి ఫొటోలు పంపిన కొడుకు ఆచూకీ కోసం వెళ్లిన తండ్రి రైలు ఢీకొని మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా అక్కన్నపేట రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మృతుడు కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం భాగిర్తిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి. వివరాలు ఇలా ఉన్నాయి. భాగిర్తిపల్లి గ్రామానికి చెందిన గంగయ్య గారి నర్సింలు (48) ఆయన కుమారుడైన రాజశేఖర్‌లకు వారి దాయాది అయిన గంగయ్యగారి స్వామితో మంగళవారం భూమి విషయమై గొడవ జరిగింది. ఈ విషయమై స్వామి భిక్కనూరు పోలీసులకు నర్సింలు, రాజశేఖర్‌లపై ఫిర్యాదు చేశాడు. తర్వాత అదే రోజు మధ్యాహ్నం నర్సింలు, కొడుకు రాజశేఖర్ మధ్య కూడా గొడవ జరిగింది. దీంతో నర్సింలు భిక్కనూరు పోలీస్ స్టేషన్‌లోతన కుమారుడిపై ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న రాజశేఖర్ ఆత్మహత్య చేసుకోవాలని భావించి మెదక్ జిల్లా అక్కన్నపేట రైల్వేస్టేషన్‌కు వెళ్లి అక్కడ పట్టాలపై పడుకుని సెల్ఫీ దిగి తన మిత్రుడికి పంపించాడు. వెంటనే సదరు మిత్రుడు ఈ విషయాన్ని గ్రామస్తులకు, నర్సింలుకు తెలియజేశాడు. అప్రమత్తమైన గ్రామస్తులు, నర్సింలు, ఆయన భార్య సత్తవ్వలు పోలీసులకు సమాచారం అందించి అక్కన్నపేట రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. గ్రామస్తులు పోలీసులు ఒక్క వైపు, నర్సింలు ఆయన భార్య సత్తవ్వ మరో వైపు వెతకడం ప్రారంభించారు. పోలీసులకు గ్రామస్తులకు రాజశేఖర్ కనిపించగా ఆయనను పట్టుకున్నారు. ఇంకో వైపు వెతుకున్న నర్సింలును అదే సమయంలో వస్తున్న రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తనయుని ఆచూకీ కోసం వెళ్లిన తండ్రి మృతి చెందడంతో భాగిర్తిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అధ్వానంగా అంతర్ జిల్లా రోడ్డు



జిల్లా సరిహద్దులో నిర్మించిన వంతెన



బురదమయంగా పిట్లం-కల్హేర్ రోడ్డు

- పిట్లం – కల్హేర్ రహదారిని అభివృద్ధి చేయని పాలకులు
- ఏళ్లు గడుస్తున్నా బీటీకి నోచుకోని వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పిట్లం(జుక్కల్): రెండు జిల్లాలను కలిపే ఆ రోడ్డు అధ్వానంగా ఉంది. పిట్లం, సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండల కేంద్రాలను కలిపే రోడ్డు అభివృద్ధి గురించి పాలకులు పట్టించుకోవడం లేదు. ఈ మార్గంలో జిల్లా సరిహద్దులో నల్లవాగుపై గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో వంతెన నిర్మించారు. వంతెనకు అటువైపు సంగారెడ్డి జిల్లాలో బీటీ రోడ్డు వేశారు. కామారెడ్డి జిల్లాలో మాత్రం బీటీ వేయకపోవడంతో మట్టిరోడ్డు వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. పంట పొలాల నుంచి నీరు ఈ రోడ్డు మీదకు రావడంతో బురదమయంగా మారుతోంది.

వంతెన నిర్మించినా ..

పిట్లం, కల్హేర్ మండలాల మధ్య దూరం మూడున్నర కిలోమీటర్లు. మధ్యలో నల్లవాగు ఉంటుంది. వంతెన లేకముందు వర్షాకాలం వచ్చిందంటే ప్రజలు పిట్లం, కల్హేర్ రాకపోకలు సాగించేవారు 15 కిలోమీటర్లు తిరిగి ప్రయాణం చేసేవారు. పిట్లం వ్యాపార కేంద్రం కావడంతో కల్హేర్ మండల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లెబాట కార్యక్రమంలో భాగంగా కల్హేర్ మండల ప్రజలు నల్లవాగుపై వంతెన నిర్మాణానికి నిధులు కావాలని కోరారు. దీంతో స్పందించిన ఆయన వెంటనే నిధులు మంజూరు చేశారు. అనంతరం వంతెన నిర్మాణం పూర్తయింది. వంతెన నుంచి కల్హేర్ వరకు బీటీ రోడ్డు వేశారు. కానీ పిట్లం నుంచి వంతెన వరకు మాత్రం మట్టి రోడ్డే ఉంది. రెండు కిలోమీటర్ల మేర రోడ్డు వేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

బీటీ రోడ్డు వేయాలి



పిట్లం, కల్హేర్ మధ్య రోడ్డు అభివృద్ధి చెందితే రెండు మండలాల ప్రజలకు ఉపయోగపడుతుంది. రెండు ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. బీటీ రోడ్డు వేయడానికి స్థానిక నాయకులు కృషి చేయాలి.– యాదగిరి, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా ఇన్‌చార్జి

ప్రతి అవసరానికి పిట్లం వస్తాం



కల్హేర్ మండలం నుంచి ప్రతి అవసరానికి పిట్లం వస్తాం. రోడ్డు బాగా లేకపోవడంతో ఇబ్బంది అవుతోంది. ఈ మార్గంలో నిత్యం వందలాది మంది ప్రయాణం చేస్తారు. అధికారులు స్పందించి రోడ్డు వేయాలి.
– కృష్ణ, రైతు, కల్హేర్ మండలం

మహిళా సాధికారతే లక్ష్యం

- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



వీసీలో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు

కామారెడ్డి క్రైం: మహిళా సాధికారతే తమ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్‌ల ఏర్పాటుపై అన్ని జిల్లాల కలెక్టర్‌లతో ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 1,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటికే ఇంధన, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య నవంబర్ 19న ఒప్పందం కుదిరిందన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్‌ల కోసం అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆర్థిక సహాయం కోసం బ్యాంకు అధికారులతో సమన్వయం చేయాలన్నారు. త్వరలోనే టెండర్లు ఖరారు చేస్తామన్నారు. ప్రతి జిల్లాలో 150 ఎకరాలకు తగ్గకుండా భూమిని సేకరించాలన్నారు. సంఘాలను గుర్తించి నిర్ధారించడం, భూ సేకరణ, బ్యాంకుల నుంచి ఆర్థిక సాయం వంటి పనులను గ్రామీణ అభివృద్ధి శాఖ, కలెక్టర్‌లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళలకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలు అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు. మహిళలు వివిధ రకాల వ్యాపారాలు చేసుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి వసతులు కల్పించాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో స్మాల్, మైక్రో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు నాలుగు నుంచి ఐదు ఎకరాలు భూమి అవసరం అవుతుందన్నారు. చిన్నపాటి ఇండస్ట్రియల్ ఏరియాల ఏర్పాటుకు అధికారులు భూములను సేకరించాలని సూచించారు. రాష్ట్రంలో 6.67 లక్షల ఎకరాలను ఇప్పటి వరకు ప్రభుత్వం గిరిజనులకు పంపిణీ చేయగా ఆయా భూముల్లో లాభసాటి పంటల సాగు జరగడం లేదని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆ భూముల్లో ఆర్థికంగా ప్రయోజనం కలిగించే పంటల సాగును ప్రోత్సాహించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ సంగ్వాన్ జిల్లా అధికారులతో సమావేశమై మాట్లాడారు. సోలార్ పవర్ ప్లాంట్‌ల ఏర్పాటు కోసం జిల్లా వ్యాప్తంగా 150 ఎకరాలు గుర్తించాలన్నారు. గ్రామాల్లో సబ్ స్టేషన్‌లకు దగ్గరలో ఉన్న భూములు గుర్తించాలని సూచించారు. సబ్ స్టేషన్‌కు 5 కిలోమీటర్ల లోపల ఉన్న అటవీ, దేవాదాయ, ఇరిగేషన్, తదితర ప్రభుత్వ భూములను కూడా పరిశీలించాలని ఆదేశించారు. వీసీలో డీఎఫ్‌వో నిఖిత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రావణ్ కుమార్, డీఆర్‌డీవో సురేందర్ పాల్గొన్నారు.

గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శులకు నియామక పత్రాలు

కామారెడ్డి అర్బన్: జూనియర్ పంచాయతీ కార్యదర్శి నుంచి గ్రేడ్ –4 పంచాయతీ కార్యదర్శులుగా రెగ్యులర్ ఆర్డర్ పొందిన 13 మందికి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) శ్రీనివాస్‌రెడ్డి బుధవారం సాయంత్రం నియామక పత్రాలను అందజేశారు. మంచి సేవా భావంతో గ్రామాల్లో ప్రజలకు సేవలు అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్(రెవెన్యూ) విక్టర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, కామారెడ్డి, బాన్సువాడ డీఎల్‌పీవోలు, పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు మహేష్‌గౌడ్, హన్మాండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శులతో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్

క్లుప్తంగా

రోడ్డు భద్రతపై అవగాహన



రాజంపేట: బస్వన్నపల్లి ఎస్‌పీఆర్‌కే పాఠశాలలో బుధవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే విద్యార్థులు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తమ తల్లిదండ్రులు తప్పకుండా ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించేలా సూచించి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. పాఠశాల కరస్పాండెంట్ సుమలత శ్యామ్ రెడ్డి, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కృష్ణతేజ, ఈర్షాదలీ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): గ్రామీణ గ్రంథాలయాలను నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని గ్రంథాలయాలకు పోటీ పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను తెప్పించినట్లు తెలిపారు. అందులో భాగంగా సదాశివనగర్ శాఖ గ్రంథాలయానికి 31 రకాల పుస్తకాలను గ్రంథపాలకుడు శ్రీనివాస్‌కు అందిజేసినట్లు చెప్పారు. అన్ని గ్రంథాలయాల్లో మౌలిక వసతులు కూడా కల్పించడానికి ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు.

చైనా మాంజా అమ్మితే కఠిన చర్యలు



మాచారెడ్డి: సంక్రాంతి సందర్భంగా గాలిపటాలను ఎగుర వేసేందుకు చైనా మాంజా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మాచారెడ్డి ఎస్సై అనిల్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంతో పాటు గజ్యా నాయక్ తండాలో పలు కిరాణా షాపులను తనిఖీ చేశారు. గాలి పటాలను కాటన్ దారంతో ఎగురవేయాలని సూచించారు.

మహాత్మాగాంధీ యూనివర్సిటీ టీం కెప్టెన్‌గా పావని



బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాది గ్రామానికి చెందిన కడావత్ పావని మహాత్మాగాంధీ యూనివర్సిటీ మహిళల వాలీబాల్ జట్టు కెప్టెన్‌గా ఎంపికైనట్లు కోచ్ సురేందర్ తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై జేప్పీఆర్ యూనివర్సిటీలో ఈనెల 8నుంచి 13వరకు అంతర యూనివర్సిటీల క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా యూనివర్సిటీ కెప్టెన్‌గా ఎంపికైన పావనిని, కోచ్ సురేందర్‌తో పాటు వాలీబాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హన్మంత్‌రెడ్డి, సెక్రటరీ మల్లేష్‌గౌడ్ బుధవారం అభినందించారు.

పోస్టాఫీసుల్లో సమస్యలు పరిష్కరించాలని వినతి

బిచ్కుంద: జుక్కల్, బిచ్కుంద పోస్టాఫీసుల్లోని సమస్యలు పరిష్కరించి, సొంత భవనాలు మంజూరు చేయాలని కోరుతూ మద్నూర్ చెందిన సామాజిక కార్యకర్త అజయ్ తమ్మేవార్, హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు కరీంనగర్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ.. పోస్టాఫీసుల్లో సరైన సౌకర్యాలు లేక పింఛన్ కోసం వెళ్లిన వృద్ధులు, మహిళల అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. మంత్రి బండి సంజయ్ వెంటనే స్పందించి ప్రత్యేక కార్యదర్శి ద్వారా పోస్టల్ శాఖ కేంద్ర మంత్రికి ఈ విషయం గురించి లేఖ పంపించారని తెలిపారు. కావలసిన వసతులపై అధికారుల ద్వారా నివేదిక తెప్పించుకొని సమస్య పరిష్కరిస్తామని పోస్టల్ మంత్రి కార్యాలయ అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు.

ప్రవాసీయులపై పట్టింపేదీ?

- ప్రభుత్వాలకు ఆదాయం లభిస్తున్నా.. వారి సంక్షేమంపై దృష్టిసారించని వైనం
- నేడు ప్రవాసీ భారతీయ దినోత్సవం



మోర్తాడ్(బాల్కొండ): ప్రవాస భారతీయుల వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు భారీ మొత్తంలో ఆదాయం సమకూరుతున్నా వారి సంక్షేమంపై చిత్తశుద్ధి లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత గల్ఫ్ వలస కార్మికుల కోసం కొన్ని సంక్షేమ పథకాలను అమలులోకి తీసుకవచ్చారు. గల్ఫ్‌యేతర దేశాల వలస కార్మికుల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించాల్సి ఉంది.ప్రతి ఏటా జనవరి తొమ్మిదో తేదిన ప్రవాస భారతీయ దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా జరుపుతున్నా.. వారి బాగోగుల గురించి ఆలోచించే వారు లేకపోవడంతో ప్రవాసీయులకు నష్టం వాటిల్లుతుందనే వాదన బలంగా వినిపిస్తోంది.

ప్రవాసీయుల్లో 90శాతం కార్మికులే..

ప్రవాసీయులలో ప్రధానంగా గల్ఫ్ వలసదారుల సంఖ్య అధికంగా ఉంటోంది. వీరిలో 90 శాతం మంది కార్మికులే కావడంతో వారి కుటుంబాలకు ఎన్నో పథకాలను అమలు చేయాల్సిన అవసరం ఉందనే డిమాండ్ పెరిగింది. గత కొన్నేళ్లుగా విదేశాంగ శాఖ ఆధ్వర్యంలో ప్రవాసీ భారతీయ దినోత్సవం జరుపుతూ వలస కార్మికుల సంక్షేమం గురించి గొప్పగా చెబుతున్న నాయకులు ఆచరణలో పథకాలను అమలు చేయడం లేదు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను అంతకుముందు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవాసీయుల సంక్షేమం కోసం నయా పైసా కేటాయించలేదు.

సమస్యలు..

గల్ఫ్ దేశాలకు వీసాల జారీ మొదలుకొని వేతనాలు ఎగ్గొట్టడం ఇతరత్రా మోసాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. మోసాలను అరికట్టడంలో అధికార యంత్రాంగం విఫలం అవుతోంది. అలాగే గల్ఫ్ మినహా ఇతర దేశాల్లో ఎవరైనా మరణిస్తే వారి మృత దేహాలను సొంతూర్లకు పంపించడానికి అధికార యంత్రాంగం ఎంతో కృషి చేస్తుంది. గల్ఫ్ దేశాల్లో మన దేశంవారు మరణిస్తే మాత్రం మృత దేహాల తరలింపు ఇబ్బందిగా సాగుతుంది. పార్లమెంట్ సమావేశాల్లో ఇమిగ్రేషన్ యాక్ట్ 1983ను సవరించి కొత్తగా ఇమిగ్రేషన్ బిల్లును ప్రవేశపెట్టాల్సి ఉంది. గతంలో దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేసింది. ఇప్పటి ఎన్‌డీఏ ప్రభుత్వం కూడా ఆలోచన చేసినా ఆచరణలో సాధ్యం కాలేదు. ఇమిగ్రేషన్ యాక్టులో మార్పుల కోసం ప్రవాసులు డిమాండ్ చేస్తున్నారు.

విదేశీ డబ్బు పంపడంలో మనోళ్లే ఫస్ట్..

ప్రపంచంలోని అన్ని దేశాల కంటే మన దేశం వారే విదేశాల నుంచి డబ్బులు పంపించడంలో ముందున్నారని ప్రపంచ బ్యాంకు లెక్కలు చెబుతున్నాయి. భారతీయులు వివిధ దేశాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేయడం వల్ల 2024లో 125 బిలియన్ డాలర్లు అంటే రూ.10.25లక్షల కోట్ల విదేశీ మారకద్రవ్యంను మన దేశానికి చేరవేశారు. ప్రపంచంలో అత్యధికంగా రెమిటెన్స్‌లు అందుకున్న దేశాల్లో మన దేశం మరోసారి అగ్రస్థానంలో నిలచింది. 2023లో రెమిటెన్స్‌లు 1,400 కోట్ల డాలర్లు పెరిగి 12,500 కోట్ల డాలర్లకు చేరింది. కేంద్ర బడ్జెట్‌కు రూ.1,10,700 కోట్లు, రాష్ట్ర బడ్జెట్‌కు రూ.5,940 కోట్ల ఆదాయంను ప్రవాసీయులు అందించారు.

ఆదాయంపైనే దృష్టి..



విదేశాల నుంచి మనవారు పంపిస్తున్న ఆదాయంపైనే ప్రభుత్వాలు దృష్టి సారించాయి. ఈ ఆదాయం ద్వారా ప్రభుత్వాలకు ఎంతో మేలు జరుగుతుంది. కానీ వలస కార్మికులకు మాత్రం ఏమి చేయడం లేదు.

– గంగుల మురళీధర్‌రెడ్డి, గల్ఫ్ జేపీసీ ప్రతినిధి

గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి..



గల్ఫ్ వలస కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కొన్ని పథకాలను అమలు చేస్తుంది. వలస కార్మికులకు పూర్తిస్థాయిలో న్యాయం జరగాలంటే గల్ఫ్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి.

– సిస్టర్ లిజీ జోసెఫ్, ప్రవాస కార్మిక సంఘాల ప్రతినిధి

బోరుమోటారు ప్రారంభం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలో బోరు మోటారును మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ బుధవారం ప్రారంభించారు. పట్టణంలోని 12వ వార్డు పరిధి లో నూతనంగా వేసిన బోరులో మోటారు బిగించి కాలనీవాసులకు నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకున్నారు. కౌన్సిలర్ నీలకంఠం, కాంగ్రెస్ నాయకులు విద్యాసాగర్, తదితరులున్నారు.

వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 41 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలు, తండాల్లో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఎంపీడీవో నరేష్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో మాట్లాడారు. పారిశుధ్య పనులను నిత్యం కొనసాగించాలని, కంపోస్టు షెడ్లలో ఎరువుల తయారీ చేపట్టాలన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేశారు. ఎంపీవో మలహరి, కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షిప్తం



అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి రూరల్: అడ్లూర్ గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెరుమాండ్ల రాములు, ఉపాధ్యక్షుడిగా కె.రాజ్ కుమార్, కార్యదర్శిగా సాయినాథ్, ఉప కార్యదర్శిగా నవీన్, కోశాధికారిగా ఈశ్వర్, ఉప కోశాధికారిగా కె.బాలయ్య, ఆర్గనైజర్‌గా నాగరాజు, స్పోర్ట్స్ కార్యదర్శులుగా కె.బాలరాజు, నరేష్ కుమార్, సలహాదారులుగా లింగం, శంకర్, జి.లింగం, లక్ష్మణ్, కేబీ శంకర్ ఎన్నికయ్యారు.

బాధిత కుటుంబానికి నేస్తం చేయూత

మాచారెడ్డి: మాచారెడ్డి జీపీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న సింగరాయపల్లి నర్సింలు తల్లి బాలవ్వ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. నర్సింలు నిరుపేద కావడంతో బుధవారం అదే గ్రామానికి చెందిన నేస్తం అసోసియేషన్ సభ్యులు రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నేస్తం అధ్యక్షుడు షాబుద్దీన్, కోశాధికారి బాలకృష్ణ, సభ్యులు రాజు, అంజయ్య ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులు



నిజాంసాగర్(జుక్కల్): వరంగల్‌లోని గీసుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగబోయే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మద్నూర్ తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులు రుత్విక్, చౌహన్ కరణ్, గోతి జగదీశ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గంగాకిషోర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం మద్నూర్ గురుకుల విద్యాలయంలో ఖోఖో క్రీడాకారులను సన్మానించారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు కొత్తాబాది విద్యార్థిని



బాన్సువాడ రూరల్: సీనియర్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు కొత్తాబాది గ్రామానికి చెందిన ధరావత్ లావణ్య ఎంపికైంది. ఈనెల 7నుంచి 13 వరకు రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో జరిగే పోటీల్లో పాల్గొననుంది. లావణ్యను కోచ్ సురేందర్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్రటరీ హనుమంత్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్‌లు అభినందించారు.

వీఆర్‌కే విద్యార్థికి ప్రథమ బహుమతి

కామారెడ్డి టౌన్: తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర యువజన శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర యువజన ఉత్సవాల పోటీల్లో ఉపన్యాస విభాగంలో జిల్లా కేంద్రంలోని వీఆర్‌కే జూనియర్ కళాశాల విద్యార్థిని ఎ.పూర్వజ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. యువజన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి స్మితా సబర్వాల్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఈనెల 12న ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి యువజన ఉత్సవాల్లో తెలంగాణ రాష్ట్రం తరపున ఉపన్యసించడానికి పూర్వజ ఎంపికైనట్లు కళాశాల సీఈవో జైపాల్ రెడ్డి తెలిపారు. అలాగే జానపద నృత్యం విభాగంలో శాలిని, రక్షిత, గ్రూప్ పోయట్రీ(కవిత)లో హర్షిణి, డ్రాయింగ్‌లో మైత్రేయి ఉత్తమ ప్రతిభ చాటారని తెలిపారు. విద్యార్థులను కళాశాల డీన్ నవీన్ కుమార్, కో–ఆర్డినేటర్ దత్తాత్రి, ప్రిన్సిపల్‌లు సైదయ్య, శంకర్, శివాజీ రావు, శ్రీవాణి అభినందించారు.

ఝార్ఖండ్‌కు జిల్లా క్రీడాకారులు



రామారెడ్డి: ఎస్‌జీఎఫ్ అండర్ –14 విభాగంలో రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన ఉప్పల్‌వాయి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల క్రీడాకారులు కె.ప్రవీణ్, కె. సంకేత్, ఎ.దిల్సన్, డి. సంతోష్ ఈ నెల 11 నుంచి 14 వరకు ఝార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ రాష్ట్రం తరుపున పాల్గొనడానికి వెళుతున్నట్లు కోచ్ సురేష్ తెలిపారు. క్రీడాకారులను కళాశాల ప్రిన్సిపాల్ శివరామ్, వైస్ ప్రిన్సిపాల్స్ మోహన్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, పీఈటి మహేష్, కళాశాల సిబ్బంది అభినందించారు.

విద్యార్థులు మొబైల్ ఫోన్లకు బానిసలు కావొద్దు



మాట్లాడుతున్న జిల్లా మెంటల్ హెల్త్ ఆఫీసర్ రమణ



హాజరైన విద్యార్థినులు

దోమకొండ: మొబైల్ ఫోన్లకు బానిస కావద్దని విద్యార్థినులకు జిల్లా మెంటల్ హెల్త్ ఆఫీసర్ జి. రమణ సూచించారు.బుధవారం మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(కళాశాల)లో 'పరీక్షల కాలంలో విద్యార్థినులు అనుసరించాల్సిన వ్యూహాలు,మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలు' అనే అంశంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రమణ మాట్లాడుతూ.. విద్యార్థినులు ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని అన్నారు. టీనేజ్ వయసులో వచ్చే అవరోధాలను అధిగమించాలని, ఎటువంటి మానసిక సమస్యలు ఎదురైనా దగ్గరలోని వైద్యులను సంప్రదించాలని లేదా టెలిమానస్ ద్వారా ఉచిత టోల్ ఫ్రీ(14416)ను సంప్రదించాలన్నారు. బీబీపేట మెడికల్ ఆఫీసర్ భానుప్రియ, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు జ్యోతి, సోషల్ వర్కర్ డా.రాహుల్ కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ రజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం జరిగిన వేర్వేరు ఘటనల్లో పలువురు మృత్యువాతపడ్డారు. విద్యుత్‌షాక్‌తో ఒక రైతు, రోడ్డు ప్రమాదంలో మరో రైతు దుర్మరణం చెందగా, రైలు ఢీకొని ఒకరు, బైక్ ఢీకొని వృద్ధుడు మృతిచెందారు.

విద్యుత్‌షాక్‌తో రైతు ..



బైని మల్లారెడ్డి (ఫైల్)

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో విద్యుత్ షాక్‌తో ఓ రైతు మృతి చెందినట్లు భిక్కనూరు ఎస్సై అంజనేయులు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన రైతు బైని మల్లారెడ్డి (61) బుధవారం ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. అక్కడ బోర్ మోటర్‌ను ఆన్ చేసేందుకు యత్నించగా అప్పటికే కరెంట్ తీగలు స్టార్టర్ బాక్స్‌కు తగిలి విద్యుత్ సరఫరా కావడంతో మల్లారెడ్డికి విద్యుత్‌షాక్ తగిలి, అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి వెంటనే కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

రెండు బైక్‌లు ఢీకొనడంతో..



రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తోండ రహదారిపై రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వివరాలు ఇలా.. కోటగిరికి చెందిన రైతు మామిడి లక్ష్మణ్(55) పొలం పనులు ముగించుకొని బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. ఎత్తొండకు చెందిన లస్మయ్య కోటగిరిలో మార్కెట్ పనులు ముగించుకొని సొంతూరుకు బైక్‌పై బయలుదేరాడు. ఈక్రమంలో ఎత్తొండ రహదారిపై ఇరువురు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నారు. ఈఘటనలో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతిచెందగా, లస్మయ్యకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

నగరంలో గుర్తుతెలియని వ్యక్తి..

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని దర్గా వద్ద ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. మృతుడు నలుపురంగు స్వెటర్ ధరించి ఉన్నాడన్నారు. అతడి వయస్సు సుమారు 60 నుంచి 65వరకు ఉండవచ్చని, భిక్షాటన చేసుకునేవారిలా ఉన్నాడన్నారు. మృతుడి సమాచారం ఎవరికైనా తెలిసినచో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సంప్రదించాలని తెలిపారు.

రైలు ఢీకొని..

ఖలీల్‌వాడి: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ తెలిపారు. వివరాలు ఇలా.. నిజామాబాద్–జాన్కంపేట్ మధ్యగల రైల్వే పట్టాలను బుధవారం సాయంత్రం ఓ గుర్తుతెలియని వ్యక్తి దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, సుమారు 25–30ఏళ్ల వయస్సు ఉంటాడని తెలిపారు. కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 8712658591కు సమాచారం అందించాలన్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడు..

రామాయంపేట(మెదక్): మెదక్ జిల్లా అక్కన్నపేటలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కామారెడ్డి జిల్లాకు చెందిన ఓ వృద్ధుడు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. జిల్లాలోని రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన దండ బోయిన నారాయణ (58) కుటుంబంతోపాటు అక్కన్నపేట గ్రామ శివారులో ఉన్న మామిడి తోటలో నివాసం ఉంటూ, పని చేస్తున్నాడు. ఈక్రమంలో కిరాణా సామగ్రి కొనుగోలు కోసం మరోవ్యక్తితో కలిసి అక్కన్నపేట వచ్చాడు. తిరిగి తోటకు వెళ్తుండగా అతడిని వెనుక నుంచి బైక్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈఘటనలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వెంట ఉన్న వ్యక్తి పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై బాల్‌రాజ్ తెలిపారు.

చికిత్స పొందుతూ..

వర్ని: ఇటీవల బస్సులో నుంచి పడిపోయిన ఓ వ్యక్తికి గాయాలు కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వర్ని ఎస్సై రమేష్ తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని అఫాదిఫారం గ్రామానికి చెందిన పాల్త్య కిషన్(45) మంగళవారం సాయంత్రం ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. ఈ ఘటనలో అతడు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటోలో పెద్ద శబ్దంతో పాటలు.. డ్రైవర్‌కు ఒక రోజు జైలు

ఖలీల్‌వాడి: నగరంలోని ఓ ఆటో డ్రైవర్ తన ఆటోలో అత్యధిక శబ్దంతో పాటలు పెట్టడంతో కోర్టు ఒక రోజు జైలుశిక్ష విధించినట్లు ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద బుధవారం తెల్లవారుజామున ఆటోనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ షేక్ ముజామిల్ (21) తన ఆటోలో అత్యధిక శబ్దంతో పాటలు పెట్టాడు. దీంతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజర్చగా ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఆటోలలో అధిక శబ్దంతో పాటలు పెట్టుకుని ప్రయాణికులను, స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



బాన్సువాడ: బీర్కూర్ మండలం బరంగెడ్గి గ్రామంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం రాత్రి పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. బరంగెడ్గి గ్రామ శివారులోని మంజీరనది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ బోల్తా.. ఒకరికి గాయాలు



వర్ని: మండలంలోని సైదిపూర్ శివారులో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడగా, ఒకరికి గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా.. గ్రామంలోని సుబ్బా అనే వ్యక్తి బుధవారం వ్యవసాయ పొలంలో దుక్కి దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. ఈఘటనలో అతడికి గాయాలయ్యాయి. వెంటనే స్థానిక రైతులు గమనించి అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

సెల్ ఫోన్ల అందజేత

బోధన్‌టౌన్: పట్టణ పీఎస్ పరిధిలో గతంలో ఫోన్లు పోగుట్టుకున్న 11 మంది బాధితులకు సెల్‌ఫోన్లను రికవరీ చేసి అందించినట్లు ఏసీపీ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. బాధితులు పీఎస్‌లో ఫిర్యాదు చేసి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలు నమోదు చేయడంతో, విచారణ చేపట్టి, ఫోన్లను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

చైన్ స్నాచర్ అరెస్టు.. బంగారం రికవరీ

- ఒక్కరోజులోనే కేసును పరిష్కరించిన నవీపేట పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై వినయ్



పట్టుకున్న బంగారం, సెల్‌ఫోన్లు

నవీపేట: మండలంలోని నందిగాం గ్రామంలో ఇటీవల జరిగిన చైన్ స్నాచింగ్ ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి, బంగారు గొలుసును రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. ఈనెల 6న నందిగాం గ్రామంలోని ఇందూరు గంగామణి మెడలోనుంచి సుమారు రెండున్నర తులాల బంగారు గొలుసును బైక్‌పై వచ్చిన ఓ దుండగుడు ఎత్తుకెళ్లిపోయాడు. బాధితురాలు మంగళవారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టారు. నిందితుడైన గంగాధర్‌ను టెక్నాలజీ ద్వారా, సీసీ ఫుటేజీ వెరిఫికేషన్ ద్వారా 24 గంటల్లోనే పోలీసులు గుర్తించి నవీపేట్ శివాజీ చౌక్ దగ్గర వాహనాల తనిఖీల్లో పట్టుకున్నారు. అలాగే దొంగిలించిన బంగారు గొలుసును, రెండు సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై 2022 అక్టోబర్‌లో బైంసా ఏరియాలో హత్యాయత్నం కేసు నమోదైనట్లు ఎస్సై వినయ్ తెలిపారు.

మామిడిపల్లిలో చైన్‌స్నాచింగ్

ఆర్మూర్‌టౌన్: మామిడిపల్లిలో మంగళవారం రాత్రి చైన్‌స్నాచింగ్ జరిగింది. వివరాలు ఇలా.. మామిడిపల్లిలోని 8 వార్డులో గల లాక్కారం రుకుంబాయ్ కార్ఖానాలో బీడీలు ఇచ్చి ఇంటికి వస్తోంది. ఈ తరుణంలో వెనుక నుంచి వచ్చిన ఓ గుర్తుతెలియని దుండగుడు ఆమె మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లిపోయాడు. బాధితురాలు వెంటపడినప్పటికీ బైక్ పారిపోయారన్నారు. అనంతరం బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మెకానిక్ షాపులో బైక్‌లు చోరీ



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని బైక్ మెకానిక్ షాపు నుంచి గుర్తుతెలియని దుండగులు రెండు పల్సర్ బైక్‌లను చోరీ చేసినట్లు ఎస్సై ఎండీ షరీఫ్ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా మండల కేంద్రంలోని రైల్వేగేటు సమీపంలోని శ్రీవేంకటేశ్వర టూవీలర్ బైక్ రిపేర్ వర్క్‌షాపును మంగళవారం రాత్రి సిబ్బంది ఎప్పటిలాగే పనుల అనంతరం మూసివేసి ఇళ్లకు వెళ్లారు. బుధవారం ఉదయం వచ్చి చూసేసరికి షాపు షట్టర్ ధ్వంసం చేసి ఉంది. వెంటనే సిబ్బంది దైవదర్శనం కోసం శబరిమల వెళ్లిన షాపు యజమాని భాస్కర్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. భాస్కర్ చోరీ విషయాన్ని డిచ్‌పల్లి పోలీసులకు తెలియజేశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. స్థానిక సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా అర్ధరాత్రి గుర్తుతెలియని ముగ్గురు దుండగులు వచ్చి షట్టర్‌ను గడ్డపారతో ధ్వంసం చేసి లోపల ఉన్న రెండు పల్సర్ బైక్‌లను ఎత్తుకెళ్లిన దృశ్యాలు కన్పించాయి. సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైన్స్‌షాప్‌లో చోరీకి యత్నం



దుండగులు ధ్వంసం చేసిన వైన్స్ దుకాణం షట్టర్

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలోగల ఓ వైన్స్‌షాప్‌లో గుర్తుతెలియని దుండగులు చోరీ ప్రయత్నం చేశారు. వివరాలు ఇలా.. మామిడిపల్లిలోని శ్రీ లక్ష్మినర్సింహ వైన్స్‌లో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు షాప్ షట్టర్‌ను ధ్వంసం చేస్తుండటంతో శబ్దం రావడంతో అక్కడే పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. కానీ దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. కాగ గాంధీ నగర్‌లోని ఒకరిని పట్టుకొని స్థానికులు పోలీసులకు అప్పగించారు. మొత్తం ఐదుగురు దొంగలు ఉన్నట్లు తెలిసింది. కాగ షాప్‌లో చోరీ జరగలేదని వైన్స్‌షాప్ యజమాని తెలిపారు.

పెద్దమ్మ ఆలయంలో హుండీ..

రాజంపేట: మండల కేంద్రంలోని స్థానిక పెద్దమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గుడి ప్రాంగణంలోని హుండీ తాళాలు పగలగొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై ముదిరాజ్ సంఘం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు